తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## కన్నులపండువగా ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాత్రి ఆలయంలో జ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా పూలతో అలంకరించి వెండిప్రదోష నందివాహనంపై ఆశీనుల్నిచేసి ఆలయంలోనే ప్రదక్షిణలు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి వద్ద స్వామివారికి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ప్రదోష నందిసేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

తిరుచానూరు, జూన్ 1, ప్రభాతవార్త



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపం వద్ద తీర్థప్రసాదాలు అందజేసారు.

# ఈ పాపమెవరిదీ !?

## బ్రహ్మోత్సవాల వేళ గోవిందరాజ ఆలయంలో విషాదం

### -భారీచెట్టు కూలి ఒకరు మృతి, నలుగురికి తీవ్రగాయాలు





తిరుపతి/క్రైమ్, జూన్ 1ప్రభాతవార్త:
బ్రహ్మోత్సవాలు ముగింపుకు చేరుకుంటున్న వేళ అప్పటి వరకు భక్తులు తమతమ మనోభిప్రాయాలను చెప్పుకుంటూ వున్న సమయంలో తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం విషాదసంఘటన జరిగింది. ఉరుములతో భారీ ఈదురుగాలులు వీయడంతో ఆలయంప్రాంగణంలో ధ్వజస్తంభానికి సమీపంలో భారీ రావిచెట్టు కూలి ఒక భక్తుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో నలుగురు భక్తులు క్షతగాత్రులయ్యారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు చేదు దారుణసంఘటన ఎదురవడానికి బాధ్యులెవరనేది అటు ఆలయ వర్గాల్లో ఇటు భక్తుల్లో ఆవేదన కలిగించింది. దైవదర్శనానికి వచ్చిన ఆ కుటుంబంలో పెద్దదిక్కు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్న మృతుని కుటుంబానికి 5లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రాణానికి టిటిడి వెలకట్టేసిందనే విమర్శలు వెల్లువెత్తాయి. తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మరోరోజులో ముగింపుకు చేరుకుంటున్నాయి. ఇంతలోనే గురువారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన భారీ ఈదురుగాలులతో కూడిన వానకు ఆలయంప్రాంగణంలోని వందేళ్ళ భారీ రావిచెట్టు కూలిపోయింది. చెట్టుక్రింద కూర్చున్న భక్తులు జరిగిన ఈ విషాదకరసంఘటనతో ఆలయంలో ఉన్న భక్తులందరూ హాహాకారాలతో వెలుపలకు పరుగులుతీశారు. గురువారం సాయంత్రం స్వామివారి దర్శనం చేసుకుని ఆలయం ప్రాంగణంలోపల కూర్చున్నారు. అదే సమయంలో బలమైన గాలులతో వర్షం కురవడంతో భారీ వందేళ్ళ రాగిచెట్టుకూలిపోయింది. ఈ సంఘటనలో చెట్టుక్రింద కూర్చున్న భక్తుల్లో కడపజిల్లాకు చెందిన డాక్టర్ గుర్రప్ప(50)అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్రంగాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం ,ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ నాగేశ్వరరావు హుటాహుటిన ఆలయానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. యుద్ధప్రాతిపదికన కూలిన చెట్టునుతొలగించారు. అప్పటి వరకు ఆలయానికి గేట్లు అన్నీ మూసేశారు. భక్తులను వెలుపలకు పంపించారు. గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తామని టిటిడి అధికారులు ప్రకటించారు.

**-ఎండిన చెట్లు, ప్రమాదకరచెట్లు తొలగించడంలో నిర్లక్ష్యం:**

ఆలయంప్రాంగణంలోనేగాక టిటిడికి చెందిన తిరుపతిలోని విద్యాసంస్థలు, కార్యాలయాలు, తిరుమలలోని అనేక కాటేజీలు, అతిధిగృహాలు, క్యూలైన్ల దారుల్లో భారీ ఎండిన, మోడైన చెట్లను తొలగించాల్సి ఉంది. అందులో వేసవికాలంలో వచ్చే వానలకు బలమైన గాలులు తోడవుతుంటాయి. ఈ నేపధ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందుగానే ఎండిన చెట్లను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇటీవల టిటిడి ఆ దిశగా దృష్టిసారించడంలేదనేది ఉద్యోగవర్గాల్లోనే విమర్శలు లేకపోలేదు. ఈ నిర్లక్ష్యంతోనే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ఒక భక్తుడు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపణలు బలంగా ఉన్నాయి.

**క్షతగాత్రులు తిరుపతి వాసులే..**
**పరామర్శించిన టిటిడి ఛైర్మన్ .. ఇఒ**

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రావి చెట్టు కూలిన సంఘటనలో గాయపడి బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టిటిడి ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి, ఇ.ఒ. ఎ.వి. ధర్మారెడ్డి, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌లు గురువారం రాత్రి పరామర్శించారు. తిరుపతికి చెందిన క్షతగాత్రులు చంద్రశేఖర్, బేబి, కుమారి నిహారికల ఆరోగ్య పరిస్థితి గురించి వీరు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడుతూ ఈ సంఘటన పట్ల భయపడవద్దని మెరుగైన వైద్యం అందించి క్షేమంగా ఇళ్లకు చేరేలా చర్యలు తీసుకుంటామని వారికి ధైర్యం చెప్పారు.

### వైఎస్సార్ రైతు భరోసాతో

## వ్యవసాయానికి ఎంతో మేలు

**తడలో జిల్లాస్థాయి కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



తడ, జూన్ 1 ప్రభాతవార్త

రాష్ట్రంలో రైతు భరోసా సాయం వ్యవసాయ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతోందని తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం తడలోని ఎస్ఆర్ఎం గ్రాండియర్ హోటల్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా పత్తికొండలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి విడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో రైతులకు వీడియో ద్వారా తడలో చూపించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి పాలక మండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య, శాసనసభ్యుడు ఆదిమూలం, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.ప్రసాదరావు, ఉమ్మడి జిల్లాల కేంద్ర వ్యవసాయ బ్యాంకు ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సూళూరుపేట ఆర్‌డిఓ చంద్రముని,తడ ఎంపిపి కొళవి రఘురెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అభివృద్ధిపై వివిధ నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ గురించి ఈ సందర్భంగా వివరించారు. ఆర్‌బికెల ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలు విరివిగా అందజేస్తున్నామని, తద్వారా రాష్ట్రంలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా 52 లక్షల 30 వేల 939 మంది రైతులకు మొదటి విడత రైతు భరోసా కింద ఒక్కొక్కరికి రూ.5,500, పిఎం కిసాన్ కింద మరో రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని అధికారులు పేర్కొన్నారు.

## సూచికబోర్డును సరిచేయండి!

### -జిల్లా కలెక్టరేట్‌లో బోర్డు జారిపడే ప్రమాదం

*తిరుపతికలెక్టరేట్, జూన్ 1 ప్రభాతవార్త:*



*తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్‌కు వెళ్ళే మార్గంలో ఓ సూచిక బోర్డు జారిపడే ప్రమాదంలో ఉంది. ఇక్కడ సమావేశంహాలు, ఎన్ఐటి గదికెళ్ళే మార్గాలను సూచించేలా బోర్డు ఏర్పాటు చేయబడింది. ఈ బోర్డు ఓ పక్కఊడిపోయి పడే ప్రమాదంగా మారింది. ప్రతిరోజూ వందల సంఖ్యలో సందర్శకులు, తిరుపతి జిల్లా ప్రజలతోబాటు కార్యాలయం ఉద్యోగులు ఇదే మార్గంలో నడచి వెళతారు. మరీ ప్రమాదవశాత్తు జారి ఎవరిపైనా పడితే ప్రమాదమేనని ప్రజలు చెబుతున్నారు. ఈ బోర్డును అధికారులు పట్టించుకుని సరిచేస్తారని కోరుకుందాం.*

## ఇక్కడ నీరు ఎలా తాగాలి!?

### కలెక్టరేట్‌లో తాగునీటికోసం ప్రజల ఇబ్బందులు

తిరుపతికలెక్టరేట్, జూన్ 1 ప్రభాతవార్త:




ప్రతిరోజూ వందలసంఖ్యలో పలు పనుల కోసం తిరుపతి జిల్లానలుమూలల నుంచి ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వస్తుంటారు. ఇక్కడకు పలు పనుల నిమిత్తం వచ్చే సామాన్యులు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలోని అన్ని అంతస్థుల్లో టిటిడి అధికారులు మంచినీటి ఫ్రిజ్‌లు ఏర్పాటుచేశారు. అయితే కలెక్టరేట్ కార్యాలయాలకు భవనం ఇచ్చేయడంతో ఈ తాగునీటి ఫ్రిజ్‌ల వద్ద కనీసం గ్లాసు కూడా పెట్టకపోవడంతో నీటిని ఎలా తాగాలనేది సందేహమే. అసలే మండుతున్న ఎండలు ఆపై ఎండలకు ఎక్కడెక్కడి నుంచో వచ్చే జనం గొంతు తడుపుకునేందుకు గ్లాసులు అవసరం. పేదలు, సామాన్యులు క్యాంటీన్‌కు వెళ్ళి మంచినీటి బాటిల్‌ను తీసుకోలేని పరిస్థితి. ఇప్పుడు ఉన్న తాగునీటి ఫ్రిజ్‌ల వద్ద గ్లాసులు ఏర్పాటుచేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుంది. తాగునీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా చూస్తారని జనం వేచిచూస్తున్నారు.

## శ్రీనివాస సేతు నిర్మాణ పనులు 92 శాతం పూర్తి

**జూన్ నెల చివరి నాటికి పూర్తి చేసి జూలై నుండి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలి :టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 1, ప్రభాతవార్త

శ్రీనివాస సేతు నిర్మాణ పనులు 92 శాతం పూర్తయ్యాయని, జూన్ 30వ తేదికి మిగిలిన 8 శాతం పనులు పూర్తి చేసి జూలై నుండి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతి టిటిడి పరిపాల భవనంలో ఈవో ఛాంబర్‌లో టిటిడి, మున్సిపల్ అధికారులతో కలిసి ఈవో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియన్స్, మొక్కల పెంపకం, డ్రైనేజి, వీధుల ఆధునీకరణ, అవసరమైన చోట్ల పెయింటింగ్, లైటింగ్ తదితర పనులను ఈ నెల 30వ తేదిలోపు పూర్తి చేయాలన్నారు. రామానుజ సర్కిల్ నుండి సుబ్బలక్ష్మి సర్కిల్ వరకు పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు ఇతర ప్రాంతాలలో తయారీలో ఉన్న బేరింగ్‌లు, వాషర్లను వేగవంతంగా తెప్పించాలన్నారు. తిరుచానూరు మార్కెట్ యార్డ్ నుండి రామానుజ సర్కిల్ వరకు, శ్రీనివాసం నుండి కపిల తీర్థం, మంగళం రోడ్డు వరకు పూర్తయిన రోడ్లను మున్సిపల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ సమావేశంలో జేఈఓ వీరబ్రహ్మం, మున్సిపల్ కమిషనర్ హరిత, సిసిఈ నాగేశ్వర రావు, మున్సిపల్ ఎస్ఇ మోహన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా గోదాము పేలుళ్ళు

## బాధితులకు నష్టపరిహారం

**యాజమాన్యం,కార్మిక శాఖపై చర్యలు: జిల్లా కలెక్టర్**



వరదయ్యపాళెం, జూన్ 1 ప్రభాతవార్త

బాణసంచా పేలుళ్ళకు సంబంధించిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆండగా ఉంటుందని ఆ కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చెక్కులను కలెక్టర్ అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పరిహారం చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు. వరదయ్యపాళెం మండలం ఎల్లకట్టవ గ్రామంలో బుధవారం బాణసంచా గోదాములో పేలుళ్ళ సంఘటనలో ముగ్గురు చనిపోయి మరో ఇద్దరు గాయపడిన సంఘటన తెలిసిందే అని కలెక్టర్ అన్నారు. వారికి స్థానిక శాసనసభ్యుడు ఆదిమూలం అభ్యర్థనతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తమకు ఆదేశాలందాయని కలెక్టర్ వివరించారు. నష్టపరిహారం చెక్కులను ఎంఎల్ఏ ద్వారా అందించారు.

**పరిహారం అందజేత:**

గురువారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, శాసనసభ్యుడు ఆదిమూలంలు ఎల్లకట్టవ గ్రామాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలు టి. ఏడుకొండలు, ఎస్.నాగేంద్రబాబు,,శంకరయ్య వారి కుటుంబాలను పరామర్శించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.5లక్షల చెక్కులను ఒక్కొక్కరికి అందజేసారు. ఈ దుర్ఘటనకు కారణమైన యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఫైర్ వర్క్స్ లైసెన్సు రెన్యూవల్ కాకుండా చర్యలు తీసుకోవాలని సూళూరుపేట ఆర్‌డిఓను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ వివరిస్తూ దుర్ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలకు వర్క్‌మెన్స్ కంపెనేషన్ చట్టం మేరకు ఫైర్ వర్క్ యాజమాన్యం నుంచి నష్టపరిహారం అందేలా నోటీసులు జారి చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో సూళూరుపేట ఆర్‌డిఓ చంద్రముని, వరదయ్యపాళెం తహశీల్దార్ గౌరీశంకర్,కార్మికశాఖ అధికారులు రంగనాథ్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చిన్న శేష, హంస వాహనాలపై శ్రీనివాసుని విహారం





వడమాలపేట, జూన్ 1 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేకంటేశ్వర స్వామి వారు గురువారం ఉదయం చిన్న శేష, రాత్రి హంస వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు వాహన సేవలు ఘనంగా జరిగాయి. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు భేరితాడనం, భేరిపూజ, ధ్వజ పటం, నవ సంధి, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం చిన్న శేష వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీనివాసునికి అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవలో ఊయల ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మేర్లపాక వద్ద కారు, బస్సు ఢీ

**మహబూబాబాద్ జిల్లా వాసులు ముగ్గురు మృతి**
**ముగ్గురికి గాయాలు: నుజ్జు నుజ్జు అయిన కారు**

ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్) జూన్ 1 ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా దంతాల వారి పల్లికి చెందిన ఓ కుటుంబానికి చెందిన ఆరుగురు తమ సొంత కారులో తిరుమలేశుని మొక్కు తీర్చుకోవటానికి మంగళవారం బయలు దేరారు. కారులో కుటుంబానికి చెందిన తల్లి వెంకటమ్మ ఆమె ముగ్గురుకుమారులు, ఇద్దరు మనవరాళ్ళతో బయలు దేరారు. బుధవారం తిరుమల చేరుకున్నారు. అక్కడ ముల్లోకాల్ని ఏలే కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాత్రి తిరుమలలోనే బస చేసారు. గురువారం ఉదయం 5గంటలకు తిరుగు పయనమయ్యారు. కారును వెంకటమ్మ మూడవ కుమారుడు, ఉపాధ్యాయుడైన రాంబాబు కారును నడుపుతున్నారు. ఇద్దరుకుమారులు, తల్లి మనవరాళ్ళు కారులో ఉన్నారు. కారు ఉదయం సుమారు 6.45గంటలకు ఏర్పేడు మండల కేంద్రం దాటుకొని ఒక కిలో మీటర్ శ్రీకాళహస్తి వైపు వచ్చారు. అక్కడ మలుపు. ముందు వెళుతున్న కారును దాటే ప్రయత్నంలో తమ కారు అదుపు తప్పింది. ఎదురుగా వస్తున్న పల్లెవెలుగు బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారునుజ్జు నుజ్జు అయ్యింది. కారు వెనకకు వెళ్ళి పక్కన ఉన్న బీడు భూమిలో పడింది. ఈ ప్రమాదంలో మూడు ప్రాణాలు గాలిలో కలిసాయి. వెంకటమ్మ (65), ఆమె రెండవ కుమారుడు అశోక్ (37) మనవరాలు సాన్వితాక్షరి (4)(దినేష్ కుమార్తె) అక్కడికక్కడే తుది శ్వాస వదిలారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్‌చేస్తున్న రాంబాబు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కారులో ఉన్న వెంకటమ్మ పెద్ద కుమారుడు దినేష్, ఆయన పెద్ద కుమార్తె భాన్వితాక్షరి (10) గాయాలతో బయట పడ్డారు. అయితే వారి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో వారిని నారాయణాద్రి ఆసుపత్రికి తరలించారు.



పరుగులు తీసిన అధికారులు. . .

సంఘటన సమాచారం తెలిసిన వెంటనే 108 ఇన్‌చార్జి హరీష్‌రెడ్డి వారి సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అలాగే మరో 108ను తిరుపతి నుంచి హుటాహుటిన రప్పించారు. మృత దేహాలను శ్రీకాళహస్తిఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. గాయపడ్డవారికి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స జరిపి తిరుపతికి తరలించారు. ప్రమాదం సంఘటన సమాచారం తెలిసిన వెంటనే సిఐ శ్రీహరి వారి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో బస్సు కుడివైపు బాగాదెబ్బతిన్నది. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గాలివాన భీభత్సం.. నేలకూలిన విద్యుత్ స్థంభాలు.. చెట్లు

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో గురువారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురుగాలులు వీచడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల విద్యుత్ స్థంభాలు, చెట్లు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శెట్టిపల్లి సబ్‌స్టేషన్, కుప్పం ఏరియా ఆస్పత్రి సర్కిళ్లలో నాలుగు విద్యుత్ స్థంభాలు నేలకూలాయి. రెస్కో అధికారులు వర్షం ఆగిన అనంతరం తెగిన విద్యుత్ లైన్లను సరిచేసి రాత్రికి విద్యుత్ సరఫరానుపునరుద్ధరించారు. ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల మామిడి, టమోటా పంటలు నేలరాలాయి.

## ఎమ్మెల్సీకంచర్లశ్రీకాంత్ ప్రోటోకాల్ నియోజకవర్గంగా కుప్పం

– కుప్పం మున్సిపల్ ఎక్స్ అఫిషియోగా నియామక ఉత్తర్వులు



కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు ప్రోటోకాల్ నియోజకవర్గంగా కుప్పంను కేటాయిస్తూ శాసనమండలి సెక్రటరీ జనరల్ డా॥ రామాచార్యులు, ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏప్రిల్ నెలలో కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా డా॥ శ్రీకాంత్‌ను పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తాజాగా డా॥ శ్రీకాంత్‌కు ప్రోటోకాల్ నియోజకవర్గంగా కుప్పంను కేటాయించడంతో ఇకపై ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొనే అవకాశం ఉంది. అలాగే కుప్పం మున్సిపాలిటీకి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా సైతం డా॥ శ్రీకాంత్‌కు అవకాశం లభించింది. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు తనకు దక్కిన గొప్ప అవకాశమని కుప్పం ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

### బలిజకులస్తులకు అండగా నిలుస్తున్న మంత్రి పెద్దిరెడ్డి - టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్

– కుప్పంలో బలిజ భవనం నిర్మాణంకు శంకుస్థాపన



కుప్పంరూరల్, జూన్ 1 ప్రభాతవార్త

బలిజ కులస్తులకు రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండగా నిలుస్తున్నారని టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర కాపు కార్పోరేషన్ ఛైర్మన్ అడప శేషు, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఏపిఐడిసి డైరెక్టర్ నందకుమార్‌లతో కలిసి కుప్పంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించే బలిజ భవనం నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కుప్పంలో బలిజ కులస్తులు ఎదురుచూసిన బలిజ భవనం నిర్మాణంకు మంత్రి పెద్దిరెడ్డి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర కాపు కార్పోరేషన్ ఛైర్మన్ అడప శేషు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా కుప్పంలో కాపు భవన నిర్మాణంకు కోటి రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ భవనం ప్రహరీగోడ నిర్మాణంకు 25లక్షలు, మంచినీటి బోరుకు 5లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. ఎంపిరెడ్డెప్పమాట్లాడుతూమంత్రిపెద్దిరెడ్డిఆశీస్సులతో భవనం త్వరగా రూపుదిద్దుకుంటుందని అవసరం ఉంటే తన ఎంపి నిధులు కూడా కొంత కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజసంఘం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, యువనేత అవినాష్, నేతలు వెంకటరామయ్య, టికె ప్రభాకర్, రాజా, గుడుపల్లె జడ్పీటిసి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



### భూముల ధరలపెంపు నిర్ణయం విరమించుకోవాలి -తెదేపా రాష్ట్ర నేత ఖాదర్ బాషా

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

రాష్ట్రంలో భూముల ధరల పెంపు నిర్ణయంను ప్రభుత్వం విరమించుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం కుప్పంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు చతికిలపడ్డాయన్నారు. క్రెడాయ్ వంటి సంస్థలుభూముల విలువ పెంచవద్దని సూచించినా ఆదాయమే పరమావధిగా ప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు. భూముల ధరల పెంపు జరిగితే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారుతుందన్నారు. ఇప్పటికే ఆరుసార్లు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచారన్నారు. ఈ ఏడాది 4వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచారన్నారు. సమావేశంలో నేతలు కాణిపాకం వెంకటేష్, నబీ ఉల్లా, బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - చిత్తూరు ఎంపి రెడ్డెప్ప

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, పేర్కొన్నారు. గురువారం రామకుప్పం మండలం బందార్లపల్లి పంచాయతీ కడమానువంక, ఎర్రచేన్లు గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందన్నారు. 2024లో మరలా సిఎంగా జగనన్న ఎన్నికవుతారన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఆదరించాలని ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో

## ఘనంగా చౌడేశ్వరీదేవి వార్షికోత్సవం



సదుం, జూన్1 ప్రభాతవార్త:

స్థానిక జాంద్రపేటలోని శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో బుధవారం ఆలయ 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవాలను 30న మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అమ్మవారికి మహాగణపతి పూజ, కంకనదారణ, నవగ్రహ చండీ హోమాలునిర్వహించారు. బుదవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి రమాదేవి, నరసింహారెడ్డి, వరలక్ష్మి, రమేష్, కల్పన, చంద్రశేఖర్‌లు చేయించిన వెండికవచాలతో అలంకరణలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. మహిళల చేత కుంకుమార్చన చేయించారు. కార్యక్రమాలలో ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన డీప తెజశ్వని, శ్రీనివాసమూర్తి, ఆకుల సరోజమ్మ, శ్రీనివాసులు, దామోదర, హైమావతి, శాంతమ్మ, సుధాకరలు వ్యవహరించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చల్లా హరి, కన్నెమ్మ, సుబ్రమన్యం, గిరి కుటుంబసభ్యులచే అన్నదానం కొనసాగించారు. రాత్రి బాణాసంచా, పిల్లన గ్రోవులు, బ్యాండు మేళాల మద్య అమ్మవారిని పుష్ప పల్లకిలో ఊరేగించారు.

## సమిష్టి కృషితో మండల అభివృద్ధి



సదుం, జూన్ 1 ప్రభాతవార్త:

మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచిలు, అదికారులు మండల అభివృద్ధికి కలిసి సమిష్టిగా కృషి చేయాలని ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డిలు అన్నారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలం గతంలో కంటే కూడా ఎన్నో విదాలుగా అభివృద్ధి చెందిందన్నారు. అటుమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒకవైపు, ఎంపీ మిధున్‌రెడ్డి మరోవైపు నిధులుతీసుకు వచ్చి మండలాన్ని అభివృద్ధి చేశారన్నారు. గతంలో ఎక్కడా ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి కావని ఈనాలుగేళ్లలో ప్రతి పంచాయతీలోను గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, ప్రతి పల్లెలోను సిమెంటు రోడ్లు నిర్మాణాలు జరుపుకున్నాయన్నారు. అనంతరం పలు శాఖలపై చర్చలు నిర్వహించారు. వారితో పాటు ఎంపీడీఓ వరప్రసాద్, మండల ఉపాధ్యక్షురాలు అమరావతి పుత్రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, తహశీల్దారు చంద్రశేఖర్, వైద్యాధికారి గిరీషా, ఏవో హరిప్రసాద్, ఏపీఓ శివశంకర్, ఎంపీటీసీలు మల్లికార్జున, శ్రీలత, స్వరూప, ఏపీఎం, ఇతర అధికారులు, సర్పంచిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ ఉద్యోగుల బదిలీ

కాణిపాకం, జూన్ 1 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను మల్లీ జోన్-2 పరిధిలోని దేవస్థానంలకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమీషనర్ సత్యనారాయణ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈమేరకు కాణిపాకం దేవస్థానంలో పనిచేస్తున్న సూపరెండెంట్‌లు కె.కోదండపాణిని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంకు, కె.శ్రీధర్‌బాబును శ్రీహానందీశ్వర స్వామి దేవస్థానంకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. అలాగే దేవస్థానంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు ఎన్.సంతానం, బి.బాలాజినాయుడు, జి.మునిరత్నంలను శ్రీశైలం శ్రీభ్రమరాంభిగా సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

## శభాష్ పోలీసులు..

రెండుగంటల్లోనే పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత



కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

ఇంటివద్ద నుంచి వెళ్లిపోయిన ఇద్దరు చిన్నారులను రెండు గంటల్లోపే గుడుపల్లె ఎస్సై లక్ష్మీకాంత్ వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఇది. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఎస్సై, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసంఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లెమండలంగుడికొత్తూరుకు చెందిన గోవిందు, అతని భార్య బెంగళూరులో జీవనోపాధి పొందుతారు. వీరికి ఇద్దరు పిల్లలు వాసు (12), కామాక్షి (9)లు సంతానం. గురువారం వాసు, కామాక్షిలు ఇంటి వద్దనుంచి ఎవరికీ చెప్పకుండా వచ్చేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై లక్ష్మీకాంత్, సిబ్బందితో కలసి గాలింపు చర్యలు విస్తృతంగా చేపట్టారు. పిల్లల కోసం గాలిస్తుండగా కుప్పం ఫ్లైఓవర్ వంతెన వద్ద వాసు, కామాక్షిలు కన్పించగా వెంటనే వారిని క్షేమంగా గుడుపల్లెకు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. పిల్లల జాడ కనుగొని రెండు గంటల్లోపే వారిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై లక్ష్మీకాంత్ చొరవ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రాయితీ వేరుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు



తవణంపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:

ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు రాయితీ వేరుశెనగ విత్తన కాయలను పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సమయానికి విత్తనాలను కొనుగోలు చేసి సబ్సిడి ధరపై రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ వేరుశెనగ కాయలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, వైకాపా నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, పరమేశ్వరరెడ్డి, అరగొండ కిషోర్‌కుమార్‌రెడ్డి, కామాలూరు పూర్ణచంద్రారెడ్డి, జొన్నగురకల రాజశేఖర్‌రెడ్డి, పలువురు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో పెనుగాలుల భారీ వర్షం

-జొన్నగురకల గ్రామంలో పిడుగుపాటు



తవణంపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:

మండలంలోని పలు ప్రాంతాలలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం మండలంలోని పలు ప్రాంతాలలో ఓ మోస్తరు నుండి భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు భారీ పెనుగాలులు వీయడంతో పలు ప్రాంతాలలో చెట్లు నేలకూలగా మామిడి కాయలు నేలరాలి మామిడి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈమేరకు మండలంలోని అరగొండ, జొన్నగురకల, గాజులపల్లె, కట్టకిందపల్లె, తొడతర, మత్యం, దిగువమాఘం, తడకర తదితర గ్రామాలలో గురువారం సాయంత్రం పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం సందర్భంగా జొన్నగురకల గ్రామంలో పిడుగు పడడంతో కొబ్బరి చెట్టు పూర్తిగా దగ్దమైంది. పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధం కావడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అలాగే పెనుగాలుల కారణంగా మామిడి తోటల్లో టన్నుల కొద్ది మామిడి కాయలు నేలరాలడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో పలు దఫాలుగా పెనుగాలులతో కూడిన వర్షం కురవడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. అయితే ప్రస్తుత ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజలు శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

## 1.2కోట్లతో ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయ నిర్మాణం

సదుం, జూన్1 ప్రభాతవార్త



మండల పరిదిలోని భట్టువారిపల్లె సమీపంలో ఉప విద్యుత్‌రెవెన్యూ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20కోట్లు మంజూరు చేసినట్లు జడ్పీ మాజీ ఉపాద్యక్షుడు పెద్దిరెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం దొడ్డగాని చెరువు సమీపంలో భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విద్యుత్‌శాఖ తరపున వినతులు వెల్లాయని వెంటనే ఆయన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. అదేవిధంగా మండలంలో ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తకుండా కొత్తగా 4 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం జోరుగా సాగుతొందని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ట్రాన్స్‌కో డిఈఈ కృష్ణారెడ్డి, ఏఈ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, కోఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, వైకాపా నాయకులు రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, జ్యోతిరెడ్డి, ట్రాన్స్‌కోసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వాలంటీర్లే మా బలం,బలగం

-వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.



బాలాయపల్లి జూన్1 ప్రభాతవార్త

వాలంటీర్లే వైసిపి బలం, బలగమని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వాలంటీర్లకు వదనం కార్యక్రమంలో ఉత్తమసేవలు అందించిన వాలంటీర్లను ఆయన గురువారం జడ్‌పి ఉన్నత పరిషత్ ఆవరణంలో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని తెలిపారు. ప్రభుత్వం అందించే పదకాలను ప్రజలకు నేరుగ వాలంటీర్లు చేరవేస్తున్నందువల్ల ఈ వ్యవస్థబాగుందని అన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థకూడా బాగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారది లాగా పనిచేయాలని వాలంటీర్లకు సూచించారు. వాలంటీర్లను ప్రభుత్వ ఉద్యాగులుగా గుర్తించేందుకు సిఎం జగన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థకూడ ఆద్భంగ ఉన్నట్లు తెలిపారు. ప్రజాసంక్షేమమే ద్యేయంగా సిఎం పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. జూలైనెలలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి నేతన్న నేస్తం ప్రారంబోత్సవానికి వెంకటగిరి వస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి ప్రాంతంలో చేనేత కార్మికులు ఎక్కువ మంది ఉన్నందువల్ల సిఎంని ఆహ్వానించినట్లు తెలిపారు. నేతన్న నేస్తం చేనేత కార్మికులకు వరం లాంటిదని తెలిపారు. ఎంపిపి గూడూరు భాస్కరరెడ్డి, ఎఎంసి చైర్మన్ సింగం శెట్టి భాస్కరరావు, సొసైటి అధ్యక్షులు వెందోటి కార్తిక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వృదయాలలో నా తల్లితండ్రులు. జనార్దనరెడ్డి,రాజ్యలక్ష్మీలు చిరస్తాయిగ ఉన్నారు

-వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి, జూన్ 1 ప్రభాతవార్త



నియోజవర్గంలో చేసిన అభివృద్దివల్ల నా తండ్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి, తల్లి నేదురుమల్లి రాజ్యలక్ష్మీలు చిరసాయిగా ఉన్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, నియోజ వర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన పట్టణం లోని బిపి కాలని మూడవ వార్డులో గురువారం గడపగపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడకు వెళ్ళిన మీనాన్న, అమ్మలు రోడ్డు వేశారని, తాగునీరు ఇప్పంచారని, ఇల్లు ఇచ్చారని, మగ్గం ఇప్పించారని వంటివి తనకు చెపుతుంటే ఆనందంగ ఉందన్నారు. దీన్ని బట్టి తల్లితండ్రులు అందరి వృదయాలలో ఉన్నట్లు తెలిపారు. విగ్రహాలు, చిత్రపటాలు ఏర్పాటు చేసి సరిపోదని చేసిన సేవలు బట్టి గుర్తింపు లభిస్తుందన్నారు. చేనేత కార్మికులప్ల సిఎం ప్రత్యేక శ్రద్ద చూపుతున్నట్లు తెలిపారు. పేదలు ఆనందంగ జీవించాలని ప్రభుత్వం సంక్షేమ పదకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా గ్రందాలయ సమస్త చైర్‌పర్సన్ దొంతు శారద, కమీషనర్ వెంకట్రామయ్య, పట్టన కన్వినర్ జి డిల్లిబాబు, వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నాయకులు లక్కమనేని కోటేశ్వరరావు, బాలయ్య, ప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణ, కౌన్సిలర్స్ పాల్గోన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

– అల్లాడుతున్న జనం

కోట, జూన్ 1 ప్రభాతవార్త

గత కొన్నిరోజులుగా పలు ప్రాంతాల్లో విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో అటు ప్రజలు, ఇటు చిరు వ్యాపారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో పోతుందో తెలియని పరిస్థితి. ఎంతసేపు ఉంటుందో అర్థంకాదు. విద్యుత్ కోతలపై ప్రజల ఆవేదన ఇది. కనీసం సమాచారం లేని కోతలతో జనం అల్లాడుతుండగా, చిరు వ్యాపారుల రోజువారీ ఆదాయంపై ప్రభావం కనిపిస్తోంది. గత కొన్నిరోజులుగా గూడూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో అటు ప్రజలు, ఇటు చిరు వ్యాపారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల వేదన వర్ణనాతీతం. ప్రజలంతా ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాల్లో ఇళ్లు ఇరుకుగా ఉండటం, బయట గాలి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సహజంగానే పట్టణాల్లో దోమల బెడద ఎక్కువ. తాజా విద్యుత్ కోతలతో దోమలు విజృంభిస్తున్నాయి. మరోవైపు జూస్, పాలు, పెరుగు, శీతల పానీయాలు, ఐస్ క్రీమ్ తదితర వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. విద్యుత్ అంతరాయంతో వ్యాపారం పడిపోతోంది. పాలు, పెరుగు, ఐస్‌క్రీమ్ పనికిరాకుండా పోతున్నాయి. విద్యుత్ ఆధారిత చేతి వృత్తులు చేసుకునే వారికి నష్టం వాటిల్లుతోంది. విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతుంటే అధికారులు మాత్రం విద్యుత్ కోతలు లేవని చెప్పడం గమనార్హం. విద్యుత్ కోతలు లేవని, కేవలం సాంకేతిక లోపం, వాతావరణ సమస్యలు, ఈదురు గాలుల వల్ల విద్యుత్ సరఫరా నిలుస్తుందని చెప్తున్నారు. ప్రతి ఉప కేంద్రం పరిధిలో స్థానిక పరిస్థితులు, లోడ్ రిలీఫ్ కోసం చేసే విద్యుత్ సరఫరా నిలిపివేతను నమోదు చేయాల్సి ఉన్నా ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది.

## ఉద్యోగుల్లో ఉత్కంఠ

కోట, జూన్ 1 ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగుల్లో సాధారణ బదిలీలపై చివరి నిమిషం వరకు ఉత్కంఠ కొనసాగింది. అన్ని ప్రభుత్వ శాఖల్లో హడావుడి కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో బదిలీల జాబితా సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు గడువును పొడిగించే అవకాశం ఉందని కొందరు అధికారులు భావించారు. ప్రధాన శాఖల్లో ఎంతమందికి బదిలీలు అయ్యాయి ? అన్న ప్రశ్నకు సంబంధిత ఉన్నతాధికారుల నుంచి సమాధానం కరవైంది. ఇప్పుడేమీ చెప్పలేమంటూ కొందరు బదులిచ్చారు. కోరుకున్న చోటకు బదిలీ కోసం ఉద్యోగులు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. దరఖాస్తులు చేసుకునే ఆఖరు క్షణం వరకు అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరిగారు. మీరు సిఫార్సు చేస్తూ ఒక లేఖ ఇవ్వండని ప్రాధేయపడ్డారు. వారు సైతం ఎవరినీ కాదనకుండా దూరదృష్టితో ఆలోచించి సిఫార్సులు లేఖలు రాసిచ్చారు. బుధవారం సాయంత్రం వరకు ఉన్నతాధికారులకు లేఖలు అందడం గమనార్హం. ఎంపి, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీల సిఫార్సుల వల్ల అధికారులు చివరి నిమిషం వరకు తేల్చలేకపోయినట్లు సమాచారం. రిక్వెస్ట్ పాలన సౌలభ్యం పేరుతో బదిలీలకు అవకాశం కల్పించడంతో ఆయా కేటగిరిలలో అధిక సంఖ్యలో సిఫార్సులకు పెద్దపీట వేసినట్లు సమాచారం. ఎన్నికల సంవత్సరం కావడంతో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గాల్సి వచ్చిందని ఒకరిద్దరు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు స్థానిక సంస్థలు జడ్పీ, మండల పరిషత్, పంచాయతీరాజ్ శాఖల్లో బదిలీలు నిర్వహించారు.

## పండుగ వాతావరణంలో అల్లాగుంట



కార్వేటినగరం, జూన్ 1 ప్రభాతవార్త:

కార్వేటినగరం మండలం అన్నూరు పంచాయితి పరిధిలోని అల్లాగుంట గ్రామంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి పండుగ వాతావరణం కల్పించారు. అల్లాగుంట నుండి ఇప్పటి వరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవ్వరూ ఎంపిక కాలేదు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ తరపున అల్లాగుంట గ్రామస్థులైన థామస్‌ని ఎంపిక చేయడంతో దేశం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

## గంగమ్మను దర్శించుకున్న భానుప్రకాష్

నింద్ర, జూన్ 1 ప్రభాతవార్త :

గురువారం మండల కేంద్రంలోని గంగమ్మను నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జీ గాలి భానుప్రకాష్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలో బుదవారం అంబిలిపోసుకొని, రాత్రి గంగమ్మను గ్రామంలో ఊరెగింపు చేసి, గురువారం ప్రజలు వేపాకు మొక్కుబడులు చెల్లించికున్నారు. గ్రామంలోని వీదులలో విద్యుత్ దీపాలంకారంతో శోభాయమానంగా అలకరించినారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గోన్నారు.

## ఫైర్ ఆఫీసర్‌గా డి.సుబ్బరాజు

నగరి, జూన్ 1 ప్రభాతవార్త:

నగరి ఫైర్ ఆఫీసర్‌గా డి.సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పీలేరు ఫైర్‌స్టేషన్ నుంచి బదిలీపై ఆయన నగరికి విచ్చేశారు. ఇది వరకు ఫైర్ ఆఫీసర్‌గా ఉన్న మస్తాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన ఏర్పరచడం, ప్రమాదాల సమయంలో త్వరితగతిన వెళ్లి అదుపు చేయడం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## కొల్లాపురిమ్మ దేవాలయంలో మహాకుంబాబిషేకం

నింద్ర, జూన్ 1 ప్రభాతవార్త :

మండలంలోని కొప్పేడు గ్రామపంచాయితీ వేదాంతపురం యస్‌టి కాలనీలో గురువారం కొల్లాపురిమ్మ దేవాలయంలో మహాకుంబాబిషేకం ఘనంగా జరిగింది. కుంబాబిషేకానికి శ్రీశైలం ట్రస్టు బోర్డు చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పండితులచే ఆశ్వీరచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేసారు. కార్యక్రమంలో రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, పరందామయాదవ్, బాలక్రిష్ణమరాజు, సుబ్రమణ్యంరాజు, దేవా, చంద్రబాబురెడ్డి, ధశరధనాయుడు, మురళీనాయుడు, సంపూర్ణబాలక్రిష్ణ, శివయ్యనాయుడు, రాజేష్, గిరిరెడ్డి, చిన్న, రజిని, చెంచమ్మ, సురేష్, తదితరులు పాల్గోన్నారు.

### స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రిక్రూట్మెంట్ కొరకు అర్హులైన అభ్యర్ధులు దరఖాస్తు చేసుకోండి

సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ

తిరుపతి (విద్య), జూన్ 1, ప్రభాతవార్త

స్టాఫ్ సెలక్షన్ కమిటీ కంబైనేడ్ గ్రాడ్యువేట్ లెవల్ 2023 మే 5వ తేది నిర్వహించిన గ్రూప్ సి కి సంబంధించిన ఉద్యోగాలు అనగా దిగువశ్రేణి, జూనియర్ సెక్రెటరీ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఖాళీలు భారతదేశంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయం నందు రిక్రుట్ చేయుటకు అర్హులైన అభ్యర్ధులు వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 8వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ కోరారు. కంప్యూటర్ ఆధారత పరీక్ష ఆంధ్రప్రదేశ్‌లో 10 సెంటర్స్ నందు నిర్వహించడం జరుగుతుందని కమిటీ తెలియజేసారు. తిరుపతి జిల్లా నుండి ఆసక్తి గల అభ్యర్ధులు పై తెలిపిన సంబంధించి ఖాళీలు, విద్యా అర్హతలకై వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్ధులు ఈ సదవకాశంను వినియోగించుకోవాలని తెలిపారు.

## గ్రంథాలయ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి, జూన్ 1 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి గ్రంథాలయ అధ్యాపక నియామకం కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైబ్రరీ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు తమ బయోడేటా, పీజీ మార్కులిస్టు, కాన్వొకేషన్‌తో ఈ నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు కళావాలలో హాజరు కావాలన్నారు. గ్రంథాలయ శాస్త్రంలో పీహెచ్‌డీ, యూజీసీ-నెట్/ఏపీ సెట్/ఏపీ స్లెట్ అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.

## నేడు కంచి గరుడసేవ

ముస్తాబవుతున్న కరకంఠేశ్వర ఆలయం

నగరి, జూన్ 1 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఆలయంలో శుక్రవారం కంచి గరుడసేవ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి సంబంధిత ఏర్పాట్లను టీటీడీ అధికారులు ప్రారంభించారు. గరుడసేవను పురస్కరించుకుని ఆలయం వద్ద ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ఆవరణలో ఇప్పటికే చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మావిడాకులు, పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ అధికారి వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తుండగా ఆలయ సేవకులు భక్తులు కంచి గరుడసేవ పనుల్లో పాలు పంచుకుంటున్నారు. కంచి గరుడసేవ జరిగే మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చే భక్తులకు ప్రసాదాలుగా మజ్జిగ, సీతల పానీయాలు అందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు.

## బాధిత ఆటో డ్రైవర్లకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆర్ధిక సాయం



చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:

భారీ వర్షం, సుడిగాలులకు ఆటోలపై చెట్లు కూలిన ప్రమాదంలో బాధితులకు చంద్రగిరి వైసిపి ఎంఎల్ఏ అభ్యర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. గరువారం సాయంత్రం చంద్రగిరిలో భారీ వర్షం, ఈదురుగాలలకు రెండు భారీ వృక్షాలు నేలకూలాయి. ఈ క్రమంలో అటుగా వెళుతున్న రెండు ఆటోలపై చెట్ల కూలడంతో పాక్షికంగా నష్టపోయారు. సమాచరం అందుకున్న మోహిత్ రెడ్డి హుటాహుటిన చంద్రగిరికి చేరుకుని బాఇతులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. దీంతో డ్రైవర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా, మాజీ వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, వైసిపి చంద్రగిరి డివిజనల్ కన్వీనర్ కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యురాలు జ్యోతి నజరత్, ఒంటి బలరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గోశాలలో ఫ్యాన్లు ఏర్పాటు చేయండి: డ్రైన్ కట్టండి:



నోరులేని మూగజీవాలకు సదుపాయాలుకల్పించండి

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భరద్వాజ తీర్థంలో నిర్వహిస్తున్న గోశాలను ఆలయ కార్యనిర్వహాణాధికారి కె.వి సాగర్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేసారు. నోరు లేని మూగజీవాల వేదనను పట్టించుకోవాలని సిబ్బందికి సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున గోశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు వేయ్యికి పైగా గోవులున్నాయి. గోశాలను పరిశీలించిన ఇఓ సాగర్‌బాబు వెంటనే గోవులకు వేసవి తాపాన్ని తట్టుకునే లా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే డ్రైన్ అస్తవ్యస్తంగా ఉందని కాలువలు సిద్ధం చేయాలని నీటి తొట్టేల సంఖ్య పెంచాలని సూచించారు.గడ్డి నిల్వ కోసం నూతనంగా నిర్మిస్తున్న షెడ్డును ఇఓ పరిశీలించారు. అలాగే గోపాలకుల పర్యవేక్షణకు సంబంధించి సిబ్బంది కొరతను వివరించారు. అలాగే లోబావిలోని అతిధి గృహాల వద్ద నూతనంగా నిర్మిస్తున్న చిన్న పిల్లల పార్కు పనులను ఇఓ సాగర్‌బాబుపరిశీలించిఇంజనీరింగ్‌విభాగానికి పలు సూచనలు చేసారు.ఈ పర్యటనలో ఇఇ మురళీధర్‌రెడ్డి డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఇ రాజేశ్వరి,మల్లికార్జున ప్రసాద్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ తదితరులున్నారు.గోశాల ఇన్‌చార్జి సురేష్ ఇక్కడి సమస్యలను ఇఓ సాగర్‌బాబుకు వివరించారు.

## యువనేస్తం కార్యాలయం ప్రారంభం:



ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్) జూన్ 1 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం రాజుల పాళెం గ్రామంలో యువనేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ మూడవ వార్షికోత్సవం సందర్భంగా కార్యాలయాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి గురువారం ప్రారంభించారు. మూడు సంవత్సరాలుగా గిరిజనుల అభివృద్దికి వారి పిల్లలను అక్షరాస్యుల్ని చేయటానికి వారు చేస్తున్న కృషిని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమాలకు ఎంఎల్‌సి రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మరో ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల కోసం రూపొందించి అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించటంతో యువనేస్తంనిర్వాహాకులు ఎంతో జవాబుదారి తనంతో వ్యవహారించారని అభినందించారు.జడ్‌పిటిసి కావేరి తిరుమల య్య,మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి,సీనియర్ నాయకులు, పంచాయతీకార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రమాదకర ఫ్లెక్సీలు తొలగించరా?



-డాక్టర్ నివేదితమోరే

.శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త

దేశంలోనే అత్యంత ప్రముఖ దేవాలయంగా ప్రసిద్దికెక్కిన శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల ఏకాగ్రతను చెదరగొట్టే విధంగా ఉంటూ, రోడ్లపై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన ప్రమాదకర ఫ్లెక్సీలను తొలగించరా అని పురపాలక సంఘ అధికారులను మాజీ కౌన్సిలర్ డాక్టర్ నివేదిత మోరే ప్రశ్నించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటు అధికారుల నిర్లక్ష్య వైఖరికి పాలక పక్షాల అధికార జులుం కలవడంతో శ్రీకాళహస్తి పట్టణంలో ఫ్లెక్సీలతో నిండిపోయి ఆధ్యాత్మికశోభ కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నియమనింధనలకు విరుద్దంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని సంబందిత ప్రాంతాలలోని ప్రజలు శ్రీకాళహస్తి పురపాలక సంఘ దృష్టికి తీసుకొచ్చినా చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడం అత్యంత బాధ్యతా రాహిత్యం అని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారా?లేదా? అని పర్యవేక్షించాల్సిన వివిధ ప్రభుత్వ శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విచారకరమని ఆమె పేర్కొన్నారు. నిర్దేశిత రుసుము చెల్లించి అనుమతించిన సమయంలోనే ఏర్పాటు చేసుకోవడం మరియు అనుమతించిన ప్రదేశాలలో మాత్రమే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చిత్తశుద్దితో పనిచేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఆలయాలు సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయాలు..మాజీ ఎంఎల్ఏ



తొట్టంబేడు, జూన్ 1 ప్రభాతవార్త

ఆలయాలు సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయాలని మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు అన్నారు. మండలంలోని రాంబట్ల పల్లెలో గురువారం నిర్వహించిన సాయిబాబా ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారన్నారు. గ్రామాల్లో ఆలయాలు నిర్మించడం ఎంతో అభినందనీయం అని అందరు భక్తిభావంతో ఉండాలన్న లక్ష్యంతో ఆలయం నిర్మించడం ఎంతో సంతోషమని నిర్వాహకులను అభినందించారు. చిన్నారులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన వారికి ఆయన బహుమతులను అందించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కలవగుంట మహదేవరెడ్డి, రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధంనాయుడు, స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల మాజీ ఛైర్మన్ గురుదశరధన్, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు నారాయణయాదవ్, గోగినేని భాస్కర్‌నాయుడు, మాజీ సర్పంచ్ ఫఠాన్‌ఫజరుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో పలువురు బదిలి

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు స్థాన చలనం వచ్చింది.ఇటీవలే ఇక్కడకు వచ్చిన వారిని కూడా సాధారణ బదిలీల్లో మళ్ళీ బదిలి వచ్చింది.వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రియాజ్‌ను పుత్తూరు మున్సిపాలిటికి బదిలి చేసారు. అక్కడ పని చేస్తున్న వంశీకృష్ణను శ్రీకాళహస్తికి బదిలి చేసారు. కాగా ఇక్కడఖాళీగాఉన్నసినియర్ అకౌంటెంట్ పోస్టుకు ప్రొద్దుటూరుకు చెందిన రమానిర్మలను నియమించారు.

## ప్రధాని ఉపాధి హామీని సద్దినియోగం చేసుకోండి:

శ్రీకాళహస్తి రూరల్,జూన్ 1 ప్రభాతవార్త



భారత ప్రభుత్వ ప్రధాని నరేంద్రమోదీ విన్నూత్న పథకాలతో నిరుపేదలను ఆదుకొనుటకు రూపకల్పన చేసారని నోడల్ అధికారి కోటి రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం స్త్రీశక్తి భవనంలో ప్రదానమంత్రి ఉపాధి కల్పనా పథకంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా లబ్దిదారులకు అవగాహన కల్పిస్తూ సూక్ష్మ చిన్న తరహా, మధ్యతరహా పథకాలకు ఇస్తున్న ప్రోత్సాహకాలకు సంబంధించి వివరించారు.ప్రాజెక్టు రిపోర్టును అందించారు. అన్‌లైన్ దరఖాస్తు విధానాలపై అవగాహన కల్పించారు.ఈ పథకం ద్వారా 35శాతం లబ్దిదారులకు రాయితీ లభిస్తుందన్నారు.ఈ పథకానికి 18 వయస్సు నిండి ఉండాలని వ్యక్తిగత ఆదాయం పరిమితి లేదన్నారు.ఉత్పత్తి రంగాలకు రూ.5లక్షలు,సేవరంగ స్థాపనకు రూ.20లక్షల వరకు బ్యాంకు నుంచి రుణం పొందవచ్చునని వివరించారు,.ఈకార్యక్రమాల్లో పిడి జ్యోతి,డిడి మురళి,డాక్టర్ ఎస్ క్రిప్, డైరెక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మల్లయోధుల పోరాటానికి మద్దతుగా ఐఎఫ్‌టియు

.తొట్టంబేడు, జూన్ 1 ప్రభాతవార్త



మహిళా మల్లయోధుల పోరాటానికి మద్దతుగా ఐఎఫ్‌టి యు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు మినీ వర్కర్లు, ఆధ్వ ర్యంలో తొట్టంబేడు మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.భారతీ జిల్లా కమిటీ సభ్యురాలు పి.శోభలు మాట్లాడుతూ 'బేటీ బచావో-బేటీ పడావో' అని పిలుపునిచ్చే ప్రధాని మోడీకి ఢిల్లీలో మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ప్రపంచ క్రీడల్లో బంగారు, వెండి, రజత, కాంస్య పతకాలు సాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేసిన క్రీడాకారులను లైంగికంగా వైధించిన వ్యక్తులను మోడీ,షాల ప్రభుత్వం కాపాడడానికి తీవ్రంగా ఖండించారు. అత్యున్నత స్థాయి క్రీడాకారులకే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.మహిళా రెజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోఐఎఫ్‌టియునాయకులువద్మ,శైలజకుమారి,మనెమ్మ,విజయ,భానుశ్రీ,మాధవి,కోమల, జయంతి,కృష్ణవేణి,మోహన్‌రాణి,ఆశావర్కర్లుస్వర్ణ,నాగభూషణ,బుజ్జమ్మ, మణెమ్మ, మీనా పాల్గొన్నారు.

## ఎలకట్టవ బాధితులకు సిఎం రిలీఫ్ రూ.5లక్షలు

వరదయ్యపాళెం, జూన్ 1 ప్రభాతవార్త



వరదయ్యపాళెం మండలం ఎల్లకట్టవ గ్రామంలో టపాసుల గోదాములో బుధవారం జరిగిన పేలుడు సంఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎక్స్‌గ్రేషి యాను ప్రకటించినట్లు శాసనసభ్యుడు ఆదిమూలం గురువారం ప్రకటించారు. ఎల్లకట్టవ సంఘటన గురించి అక్కడ మృతి చెందిన మూడు కుటుంబాలు వారి దీన స్థితి గురించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి విన్నవించగా ఆయన వెంటనే స్పందించటం పేదల పట్ల ఆయనకున్న గుర్తింపుకు నిదర్శనమని శాసనసభ్యుడు ఆదిమూలం అన్నారు.మృతులు ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షలు నష్టపరిహారం చెల్లించుటకు చెక్కులను జిల్లా కలెక్టర్ ద్వారా చెల్లిస్తామని ఎంఎల్ఏ వివరించారు.



## లక్ష్మిపతిరెడ్డికి ఘన సన్మానం

రేణిగుంట, జూన్ 1 ప్రభాతవార్త:

వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సేవలను గుర్తించి యువ నేస్తం అసోసియేషన్ అధినేత మునిశేఖర్ యువనేస్తం మూడవ వార్షికోత్సవ సందర్భంగా గురువారం యువనేస్తం అసోసియేషన్ పరిపాలన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తినియోజకవర్గ శాసన సభ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మిపతిరెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం అసలు సిసలైన ప్రజా సేవకులుగా అభివర్ణించారు. యువనేస్తం వ్యవస్థాపకులు మునిశేఖర్ సంస్థ ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సన్మాన గ్రహీతల్లో ఆకాంక్ష వ్యవస్థాపకులు డాక్టర్ మర్దాల రవిబాబు ఉన్నారు.

## అన్నవరపు సత్యనారాయణ మృతి తీరని లోటు

-తిరుపతి వాయిద్య కళాకారులు సంక్షేమసంఘం అధ్యక్షుడు



తిరుపతి ప్రెస్‌క్లబ్, జూన్ 1 ప్రభాతవార్త:

ప్రముఖ డోలు విద్వాంసులు అన్నవరపు సత్యనారాయణ మృతి తీరని లోటని తిరుపతి వాయిద్య కళాకారులు సంక్షేమసంఘం అధ్యక్షులు రుద్రకోటి సదాశివం అన్నారు. గురువారం తిరుపతిలోని ఎస్వీ.నాదస్వర డోలు పాఠశాలలో అన్నావరపు సత్యనారాయణ సంతాపసభ జరిగింది. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాలలో డోలు విభాగాధిపతిగా పనిచేస్తూ తన విజ్ఞానాన్ని అందరికి పంచి ఎందరో ప్రతిభావంతులైన డోలు వాయిద్య కళాకారులను తయారు చేశారన్నారు. ఆయన శిక్షణలో ఎందరో ఉత్తమశిష్యులు తయారై నేడు ఎంతో ఉన్నత స్థానాల్లో వున్నారన్నారు. ఈసందర్భంగా ఎస్వీ.సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దు బాల మాట్లాడుతూ సత్యనారాయణ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మృదంత విద్వాన్ సుధాకర్, సత్యనారాయణ, ఈశ్వరమ్మ, రావిపాటిసత్యనారాయణ,మునిరత్నం,శ్రీనివాసరావు,కృష్ణమూర్తి,చంద్రశేఖర్,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నేడు డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

పుత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త :

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పదో తరగతి పాసైన లేదా ఫెయిలైన విద్యార్థుల నుంచి పిజి పూర్తి చేసిన విద్యార్థుల వరకూ అందరూ పాల్గొని ఉపాధి పొందవచ్చని తెలిపారు. వివిధ రంగాలకు చెందిన 15 బహుళ జాతీయ కంపెనీలు సుమారు 556 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని నెలకు రూ. 10,000 వేల నుంచి రూ. 40,000 వేల వరకూ జీతాలు లభ్యమయ్యే ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయని తెలిపారు. వివరాల కోసం 6300954441, 8374421195, 8121984014 నెంబర్లను సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.గుణశేఖర్ తెలిపారు.

## కృష్ణమనాయుడు కుంట పనులను వేగవంతం చేయండి

కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, జూన్ 1, ప్రభాతవార్త

తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో వున్న పూరతన కృష్ణమ నాయుడు కుంట పనులను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హరిత అన్నారు. గురువారం చెన్నారెడ్డి కాలనీలోని కృష్ణమనాయుడు కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీలోని పూరతనకుంట పూర్తి స్థాయిలో పాడైపోయి శిధిలావస్థకు చేరుకోవడంతో ప్రజల విజ్ఞప్తి మేరకు పాత కట్టడాలను సంరక్షించుకోవాలనే దృక్పథంతో ఈ కుంటను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. మొదటి దశ పనులు పూర్తి చేయడం జరిగిందని, రెండవదశ పనుల్లో కుంట చుట్టూ ప్రహరి గోడలు నిర్మించడం, కుంట లోపలి వైపు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం, పచ్చదనం పెంపొందించడం, లైటింగ్ పనులు చేపట్టడం, రెయిలింగ్ నిర్మించడం జరుగుతందన్నారు. పనులను వేగవంతం చేసి మరో నెల రోజుల్లో చెన్నారెడ్డి కాలని కృష్ణమనాయుడు కుంటను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలను కమిషనర్ హరిత జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామి రెడ్డి, డిఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

## మురికి నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, జూన్ 1, ప్రభాతవార్త



తిరుపతి వినాయకసాగర్ ప్రక్కన ప్రారంభించిన 5 ఎంఎల్‌డి మురికినీటి శుద్ధి కేంద్రాన్ని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ఇటీవల ప్రారంభించిన ఈ మురికి నీటి శుద్ధి కేంద్రం వలన రోజుకి 50 లక్షల లీటర్ల మురికి నీటిని శుద్ధి పరిచి వినాయక సాగర్‌కి తరలించడం జరుగుతుందని, ప్లాంట్‌ను మరింత అభివృద్ధి పరిచి పూర్తి స్థాయిలోకి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శుద్ధి చేసిన నీటితో వినాయక సాగర్‌లో మంచి నీటిని నింపడమే కాకుండా, వ్యవసాయానికి కూడా మళ్లించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్లాంట్ లోపల రోడ్లను అభివృద్ధి పరచాలని, నిర్మించాల్సిన గోడల పనులను పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ హరిత సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

## శ్రీ మిట్టగంగమ్మ వారికి "మించల అశ్వినీ ప్రవీణ్‌కుమార్" ఉభయం

మిట్టగంగమ్మ వారికి రూ.30,116/-లు వితరణ

శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారికి రూ.10,116/-లు వితరణ



చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:

స్థానిక శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలను పురస్కరించుకుని గురువారం నరశింగాపురం ఎంపిటిసి మించల అశ్వినీ ప్రవీణ్‌కుమార్ దంపతులు అమ్మవారికి ఉభదాతలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పిలుపు మేరకు అమ్మవారికి జాతర వేడుకలలో బండవేషం రోజున ఉభయం నిర్వహించారు. ఈ క్రమంలో అమ్మవారికి దంపతులు రూ.30,116/-లు నగదు వితరణ చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణమందిరం నుండి ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, అగరాల సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి చేతులమీదుగా అమ్మవారి ఆలయానికి సారెను మోసుకువచ్చి సమర్పించారు. అదేవిధంగా చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణ పనుల నిమిత్తం ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణా రెడ్డి పిలుపు మేరకు రూ.10,116/-లు నగదు వితరణ చేశారు. ఈ క్రమంలో ఆలయ అర్చకులు దంపతులను సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి దక్షిణ మండల డివిజన కన్వీనర్ అగరాల దేవారెడ్డి, కొత్తపాటి మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియాలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

విశిష్ట అతిధిగా వెళ్ళిన పులివర్తి నాని



చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:

ఈ నెల 4న ఆస్ట్రేలియాలో నిర్వహించతలపెట్టిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని విశిష్ట అతిధిగా ఆహ్వానం అందుకున్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఆస్ట్రేలియా బయలుదేరి వెళ్ళారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దశదిశలా వ్యాపింపజేసిన మహనీయుడు మన దివంగత నందమూరి తారకరామారావు జయంతి వేడుకలకు తనను ప్రవాస ఆంధ్రులు ఆహ్వానించడం గర్వకారణమన్నారు. మహానాయకుడి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న తెలుగుజాతి ప్రవాస ఆంధ్రులకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం తాను ఆస్ట్రేలియాకు చేరుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో తమ నాయకుడు పులివర్తి నాని, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు నరిశిరెడ్డి, అశోక్‌బాబు పాల్గొనేందుకు బయలుదేరి వెళ్ళినట్లు టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్ తెలిపారు.

## మరిన్ని విజయాలను అందుకోవాలి..!

సివిల్స్ టాపర్ పవన్ దత్తకు అభినందనలు.. నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ కె.ఎల్.వర్మ

తిరుపతి ప్రెస్ క్లబ్, జూన్ 1 ప్రభాతవార్త:

జాతీయ స్థాయిలో సివిల్స్ టాపర్ పవన్ దత్త మరిన్ని విజయాలు అందుకో వాలని ఆకాంక్షిస్తున్న నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ కె.ఎల్.వర్మ అన్నారు. స్వల్ప అస్వస్థతతో స్విమ్స్‌లో చేరిన ఆయన వైద్య చికిత్సలు పూర్తి చేసుకుని గురువారం ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో సివిల్స్ టాపర్ పవన్ దత్త ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర ్భంగా వర్మ ఆయనను సివిల్స్‌లో టాపర్‌గా రాణించడం పట్ల అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ మాట్లాడుతూ పవన్ దత్త ఎంతో మంది నేటితరం యువతీ యువకులకు ఆదర్శంగా నిలుస్తానారన్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే వారికి తగిన సలహాలు, సూచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటేశ్వర్లు, లలితకుమారి, రాధాకృష్ణ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

## తెప్పపై శ్రీ సుందరరాజస్వామి అభయం



తిరుచానూరు, జూన్ 1, ప్రభాతవార్త

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో రెండో రోజైన గురువారం శ్రీ సుందరరాజస్వామి వారు తెప్పపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొల్పి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ సుందరరాజ స్వామి వారి ముఖ మండపంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో స్వామి వారు మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. తెప్పోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పపై విహరించనున్నారు. ఎఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్, అశోక్, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గాంధీపురంలో మురుగునీరు తరలింపుకు తాత్కాలిక ఏర్పాట్లు

సర్పంచ్ జోగి మోహన్‌కుమార్



తిరుపతిరూరల్, జూన్01 ప్రభాతవార్త:

గాంధీపురంలో నిలిచిపోయిన మురుగునీరు తరలింపుకు అధికారులు, స్థానిక సర్పంచ్ తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలో మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా ఇండ్లలోని మురుగునీరు బయటకు వెళ్ళకుండా నిలిచిపోవడంతో గ్రామస్తులు గురువారం రాత్రి తిరుపతి-చంద్రగిరి రోడ్డులో బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ జోగి మోహన్‌కుమార్, ఎంపిడిఓ డాక్టర్ వెంకటనారాయణలు తదితరులు గురువారం గాంధీపురానికి వెళ్ళి మురుగునీరు తరలింపుకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. జెసిబి సాయంతో మురుగునపడి పూడిపోయిన ద్వారాలను వెలికి తీసి మురుగునీరు వెళ్ళటానికి ప్రత్యామ్నయా ఏర్పాట్లు చేసారు. తిరుపతిరూరల్ పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీపురం గ్రామంలో దాదాపుగా 100 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల నుండి వచ్చే వ్యర్ధనీరు బయటకు వెళ్ళటానికి సరైన కాల్వ మార్గాలు లేవు. గతంలో చుట్టుపక్కల ఖాళీ ఇంటిస్థలాల్లోకి మురుగునీరు వెళ్ళేది. ప్రస్తుతం ఖాళీ ఇండ్ల ప్లాంట్స్‌లో ఇండ్లు నిర్మాణాలు జరగడంతో బహిరంగ ప్రవేశాలలోకి మురుగుపారుటకు అవకాశం లేకుండా పోయింది. దీంతో గాంధీపురం గ్రామం నుండి వచ్చే మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో స్థానికులుఆందోళనకుదిగారు.దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హుటాహుటీన ప్రత్యామ్నాయ తాత్కాలిక ఏర్పాట్లలో నిమగ్నమైనారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఇ రాజామస్తానయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ సేతుమాధవ్, పంచాయతీ కార్యధర్శి దుష్యంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***-శాశ్విత పరిష్కారానికి ఇతర పంచాయతీలు అడ్డు :***

***సర్పంచ్ జోగి మోహన్‌కుమార్***

గాంధీపురం మురుగునీరు వెళ్ళటానికి సమీప పంచాయతీ ప్రజలు అడ్డుతగులుతున్నారని పెరుమాళ్ళపల్లి గ్రామ జోగి మోహన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేసారు. గత 20 సంవత్సరాలుగా గాంధీపురానికి మురుగునీటి సమస్య ఉందన్నారు.. మురుగునీటి తరలింపుకు దాదాపు రూ.50 లక్షల నిధులతో ప్రణాళికలు చేపట్టినప్పటికీ సమీప పంచాయతీ ప్రజలు అడ్డుపడటంతో శాశ్విత పరిష్కార పనులు ఆగిపోయాని తెలిపారు. గాంధీపురం మురుగు నీటిని పుదిపట్ల మీదగా చెర్లోపల్లి కూడలి వద్ద నున్న పెద్దకాల్వలోకి వదిలే ప్రయ్నతం చేస్తే శాశ్విత పరిస్కారం లభిస్తుందన్నారు.

## సి.మల్లవరంలో యోగ మందిరానికి స్థల సేకరణ

-ప్రజా అవసరాలకే ప్రభుత్వ భూమి స్వాధీనం: సర్పంచ్ భారతి

తిరుపతిరూరల్, జూన్ 1 ప్రభాతవార్త:

ప్రజా అవసరాల దృష్ట్యా ప్రవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వభూమిని సి.మల్లవరం గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకుంది. ఎన్నో సంవత్సరాలుగా ప్రవేట్ పరమై వున్న ప్రభుత్వ భూమిలో యోగ మందిరమం, ఇతర ప్రజా అవసరాల నిమిత్తం గురువారం జెసిబి సాయంతో చదునుపెట్టారు. సి.మల్లవరం గ్రామ లేక్కదాఖల సర్వేనెంబర్ 49,50 నెంబర్లలో ఉన్న కాల్వపోరంబోకు స్థలానికి రెవెన్యూ, పోలీసుల సహకారంతో పంచాయతీ స్వాధీనం చేసుకుంది. ఆక్రమణకు గురై ఉన్న కాల్వపోరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసకుని ప్రజా అవసరాలకు వినియోగిస్తున్నట్లు వైకాపా నాయకులు మొక్కల తిమ్మారెడ్డి తెలిపారు.

***- ప్రజా అవసరాల దృష్ట్యా ఆక్రమణలో ఉన్న భూమి స్వాధీనం***

***-సి.మల్లవరం గ్రామ సర్పంచ్ మొక్కల భారతి***

సి.మల్లవరం గ్రామ పంచాయతీ ప్రజల అవసరాల దృష్ట్యా ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి అధికారుల సాయంతో పంచాయతీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏవరి స్వార్థప్రయోజనాల కోసమో కాదని, ప్రజల అవసరాల దృష్ట్యా ఆక్రమణలో ఉన్న భూమిలో యోగ మందిరంతో పాటు ఇతర అభివృద్ధి పనుల కోసం వినియోగించుకుంటామని తెలిపారు.

## 12 గదులతో అందుబాటులోకి ఎస్వీ అతిథిగృహం

తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించేందుకు గురువారం ఉదయం సన్నిధానం అతిథిగృహం సమీపంలో నిర్మించిన వేంకటేశ్వర అతిథిగృహాన్ని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి , వసతి కల్పనవిభాగం డిప్యూటీ ఇఒ (ఆర్ 1)పి.హరీంధ్రనాథ్, ఓఎస్‌డి రామకృష్ణతో కలసి ప్రారంభించారు.

## ఐవోబీ 56వ వార్షికోత్సవ వేడుకలు

రేణిగుంట, జూన్ 1 ప్రభాతవార్త:



ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంక్‌లో 56వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఐవోబీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిదంబరం చెట్టియార్ చిత్రపటానికి సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీచేసి ఉద్యోగస్తులను అభినందించారు. రైతులకు పంటరుణాలు, మహిళలకు గ్రూప్ రుణాలు, బంగారు నగలు, ఇంటి పత్రాలపై వాహనాలకు లోన్లు అందిస్తున్నామని ఖాతాదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ కోరారు. కార్యక్రమంలో విశ్రాంత అసిస్టెంట్ మేనేజర్ జూలియన్ రాజు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్విమ్స్ న్యూర్యాలజి విభాగంచే 8వ వార్షిక ఓరేషన్

తిరుపతి నగరం, జూన్ 1, ప్రభాతవార్త



స్విమ్స్ న్యూరాలజి విభాగం, ఇండియన్ ఎపిలెప్సీ అసోసి యేషన్ విభాగంచే ఎపి లెప్సీ కేర్ మోడల్ ఫర్ రూరల్ ఇండియా అనే అంశం పై గురువారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో 8వ వార్షిక ఓరేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేసారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి, ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరుపతి బ్రాంచ్ డా. వెంగమ్మ, ముంబాయి నగరానికి చెందిన డా. నిర్మల్ సూర్య ఫౌండేషన్ ట్రస్టీ, చైర్మన్ ఎపిలెప్సీ పౌండేషన్ ముంబాయి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ శ్రీహరి, ఐఇఎ వైస్ ప్రెసిడెంట్ రాఘవ రెడ్డిలు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి, ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరుపతి బ్రాంచ్ డా. బి. వెంగమ్మ మాట్లాడుతూ ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ తిరుపతి వారితో కలిసి స్విమ్స్‌లో నిర్వహించే ఉచిత మూర్ఛ వైద్య శిభిరాలకు హాజరయ్యే వారందరికి ఒక నెలకు అవసరమయ్యే మందులను ఉచితంగా పంపిణీ చేయబడుతున్నాయన్నారు. ప్రస్తుతం సుమారు 600 - 650 మంది మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులు ఈ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని తెలియజేసారు. మన జనాభాలో ప్రజలు 85 శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారని, ఎక్కువ శాతం మంది మూర్ఛ వ్యాధి గ్రస్థులు గ్రామీణ ప్రాంతంలో వున్నట్లు గుర్తించడమైంది. మూర్ఛ వ్యాధి గ్రస్థులు చికిత్సకు అవసరమయ్యే మందులు తీసుకునేటప్పుడు డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా వాడాలని లేనిచో ప్రమాదం మరింత తీవ్రంగా వుంటుందని తెలిపారు. ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరుపతి చాప్టర్, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. బి. వెంగమ్మ ఓరేటర్‌గా విచ్చేసిన డాక్టర్ నిర్మల్ సూర్యని గోల్డ్ మెడల్‌తో సత్కరించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ వైద్యులు న్యూరాలజీ సీనియర్ ప్రొ. డా. శివకుమార్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. శరణ్ బి సింగ్, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజు, ఆర్ఎంఒ డా. కోటి రెడ్డి, ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ తిరుపతి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ డా. రాఘవరెడ్డి, ట్రెజరర్ ప్రొ. సుబ్రమణ్యం, ఇతర సభ్యులు, డిఎంహెచ్ఓ శ్రీ హరి, డా. హర్షవర్ధన్, న్యూరాలజి విభాగపు వైద్యులు, వివిధ విభాగాధిపతులు, వైద్యులు, యుజి, పిజి వైద్య విద్యార్థులు, ఎంబిబిఎస్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జల సంరక్షణకే అమృత్ సరోవర్ నిర్మాణాలు

రామచంద్రాపురం, జూన్ 1 ప్రభాతవార్త:

జల సంరక్షణకే అమృత్ సరోవర్ కొలనుల నిర్మాణాలు ఉపాధి హామీ పథకంలో చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ వెంకటరమణ అన్నారు. గురువారం పుల్లమ నాయుడు కండ్రిగ, సి.రామా పురం పంచాయతీలలో చేపడుతున్న అమృత్ సరోవర్ పనులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది వేల క్యూబిక్ లీటర్ల నీటి సామర్థ్యం నిల్వ వుండే విధంగా కొలనులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తద్వారా కొలను పరిసర ప్రాంతాలలో గల వ్యవసాయ బోర్లు, బావులలో భూగర్భజల మట్టం పెరుగుతుందన్నారు. ఎన్ఆర్ఈజిఎస్‌లో 50 కుటుంబాలు ఈ కొలను నిర్మాణ పనుల్లో భాగస్వాములైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఏడి రమేష్ రెడ్డి, ఎంపిడిఓ మహ్మద్ రఫీ, ఏపిఓ హంసవేణి, డిఆర్‌పి రవి, ఎఫ్ఏ ఇరగం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**In the Court of the Addl. Senior Civil Judge,Chittoor**
**O.S.No. 392 of 2011**
Between:
**M.Meena Kumari** ....Plaintiff
And :
**Smt Mangala & Others** ....Defendants
**NOTICE TO THE DEFENDANTS NO.6 AND 7**
**1.RENUKA,**W/o Lokanadham**(D6)**
**2.MENAKA,**W/o Prakash**(D7)**
Both are residing at D.No.10-364, Pedda Harijanawada, Chittoor Town and District, A.P
Please taken notice that above case stands posted to **13.06.2023 at 10.30 A.M** for your appearance before the Hon'ble Court. If you fail to appear on that date either in person or to your counsel,the matter wil be decided on merits in your absence.
Sd/-**P.DAYASEKHAR**
Advocate -Chittoor,

# గ్రూప్ - 1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## జిల్లా రెవిన్యూ అధికారి కోదండరామిరెడ్డి



మాట్లాడుతున్న రెవిన్యూ అధికారి కోదండరామిరెడ్డి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 1, ప్రభాతవార్త

ఈ నెల 3వ తేది నుంచి 4వ తేది మినహా 10వ తేది వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించబోయే గ్రూప్ -1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారులతో స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ ఈ గ్రూప్ 1 పరీక్షలు జూన్ 3వ తేది నుంచి 10వ తేది వరకు ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ లో జరగనున్నట్లు, ఈ పరీక్షలకు జిల్లా మొత్తం 577 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని అభ్యర్థులను ఉదయం 8 గంటల 30 నిమిషాల నుండి 9.30 నిమిషాల వరకు అనుమతిస్తారు. గ్రేస్ పీరియడ్ 15 నిమిషాల తరువాత అనగా 9.45 సమయం తరువాత ఎవరిని అనుమతించబోమని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, మొబైల్ ఫోన్లు అనుమతించడం జరగదన్నారు. ఈ సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డివో కనకనరసా రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ఏపిపిఎస్సి సహాయ కార్యదర్శి సిహెచ్ సాయి ప్రకాష్, సెక్షన్ ఆఫీసర్స్ ఎస్. ప్రతాప్ కుమార్, డి. షణ్ముఖరావు, జిల్లా అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వహణ ప్రాంత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీసులు..

### రెండుగంటల్లోనే పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త


పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై లక్ష్మీకాంత్

ఇంటివద్ద నుంచి వెళ్లిపోయిన ఇద్దరు చిన్నారులను రెండు గంటల్లోపే గుడుపల్లె ఎస్సై లక్ష్మీకాంత్ వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఇది. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఎస్సై, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసంఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం గుడి కొత్తూరుకు చెందిన గోవిందు, అతని భార్య బెంగళూరులో జీవనోపాధి పొందుతారు. వీరికి ఇద్దరు పిల్లలు వాసు (12), కామాక్షి (9)లు సంతానం. గురువారం వాసు, కామాక్షిలు ఇంటి వద్దనుంచి ఎవరికీ చెప్పకుండా వచ్చేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై లక్ష్మీకాంత్, సిబ్బందితో కలసి గాలింపు చర్యలు విస్తృతంగా చేపట్టారు. పిల్లల కోసం గాలిస్తుండగా కుప్పం ఫ్లైఓవర్ వంతెన వద్ద వాసు, కామాక్షిలు కన్పించగా వెంటనే వారిని క్షేమంగా గుడుపల్లెకు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. పిల్లల జాడ కనుగొని రెండు గంటల్లోపే వారిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై లక్ష్మీకాంత్ చొరవ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## గంగాధరనెల్లూరు దేశం ఇన్‌చార్జిగా డాక్టర్ థామస్

కార్వేటినగరం, జూన్ 1 ప్రభాతవార్త:



గంగాధరనెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జిగా డాక్టర్ వి.ఎం.థామస్‌ని జాతీయఅధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియమించినట్లు కార్వేటినగరం మండల అధ్యక్షులు చెంగల్‌రాయల్‌యాదవ్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆరుమండలాల అధ్యక్షులు, మాజీమంత్రి అమర్‌నాథరెడ్డి, పార్లమెంటు మహిళాఅధ్యక్షులు అరుణ, నియోజకవర్గ నాయకుడు భీమినేని చిట్టిబాబు, రైతు అధ్యక్షులు నాగేశ్వరరాజుల సమక్షంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులను అధిగమించాలంటే ఆర్థికంగా బాగున్న థామస్‌ని ఎన్నుకుంటే బావుటుందనే నిర్ణయంతో ఎన్నిక జరిగిందన్నారు. పదవులను ఆశించిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఈ సంధర్భంగా చర్చింపుకు రావడం జరిగిందన్నారు. ఏ బూత్‌లో మెజారిటీ తెప్పిస్తారో వారికి రాజకీయంగా తగిన పదవులు అందిస్తామని చంద్రబాబు ప్రస్తావనకు తెచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రాత్రిబంవళ్ళు తెలుగుదేశం జెండా ఎగరడానికి సైనికుల్లా పని చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

## సీతారాముల ఆలయ కుంబాభిషేకం

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని బిపి అగ్రహారంలో భక్తుల భాగస్వామ్యంతో సీతారాముల ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్టలు జరిగాయి. కుంబాభిషేకం సందర్బంగా గురువారం న ా య ు ం డ ు ల ు హాజరయ్యారు. దార్మిక క్షేత్రంగా ప్రసిద్ది చెందిన శ్రీకాళహస్తిలో వాడ వాడల్లో సీతారాముల మందిరాలు వెలసి భక్తి భావాన్ని చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో బిపి అగ్రహారంలో భక్తుల భాగస్వామ్యంతో చక్కటి రామమందిరాన్ని నిర్మించారు. ఇక్కడ శాస్త్రోక్తంగా సంప్రదాయబద్దంగా విగ్రహాలను పూజలు జరిపి ప్రతిష్టించారు. గురువారం కుంబాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. పూజలు జరిపారు. అతిధులకు మందిర నిర్వాహకులు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమాల్లో రత్నం రెడ్డి, పిజె చంద్రయ్యశెట్టి, ఆర్కాట్ శంకర్, పరమేశ్వరరావు, జనార్ధన్‌రావు, దశరథరామిరెడ్డి, బుజ్జిరెడ్డి, గురువారెడ్డి, కిట్టు మేస్త్రీ, కుమారస్వామి రెడ్డి, భరత్‌రెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, నాగేంద్రబాబు, మునిరామయ్య, టిటిడి ధర్మప్రచార పరిషత్‌కు చెందిన రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖలో సాధారణ బదలీలు

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త

రాష్ట్రంలోని దేవాదాయశాఖ తమ పరిధిలోని దేవాలయాల్లో బదిలీలను చేపట్టారు. అన్ని కేడర్‌లలో బదిలీలను బుధవారం రాత్రి చేపట్టినట్లు కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారిచేసారు. ఇంజనీరింగ్ శాఖలో చేపట్టిన బదిలీల్లో తూర్పుగోదావరి జిల్లాలోని అన్నవరం ఆలయంలో ఇఇగా పని చేస్తున్న వెదురుపాక నూక రత్నమ్మను శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలి చేసారు. కాగా ఇక్కడ పని చేస్తున్న ఇఇ మురళీధర్‌రడ్డిని శ్రీశైలం ఆలయానికి బదిలి చేసారు. కాగా శ్రీశైలంలో పని చేస్తున్న ఎఇఒ, పిఆర్ఓ టి.శ్రీనివాసరావును శ్రీకాళహస్తీశ్వరాలయ ఎఇఒగా బదిలి చేసారు. కాగా సూపరింటెండెంట్ల స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులను కూడా బదిలి చేసారు. కాణిపాకంలో పనిచేస్తున్న కే.కోదండపాణిని శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలి చేసారు. సీనియర్ అసిస్టెంట్లలో ఎం.శ్రీనివాసరావు ప్రస్తుతం శ్రీశైలంలో పని చేస్తుండగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలి చేసారు. మహానందిలో పని చేస్తున్న ఏ.శశిధర్‌రెడ్డిని శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలి చేసారు. జూనియర్ అసిస్టెంట్ జి.రాఘవేంద్రకుమార్ ప్రస్తుతం శ్రీశైలంలో పని చేస్తుండగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలి చేసారు. జూనియర్ అసిస్టెంట్ వై.లక్ష్మయ్యను కాణిపాకంకు బదిలి చేసారు. ఈ మేరకు ఉత్తర్వులు జారి అయ్యాయి. కాగా ప్రస్తుతం ఇక్కడ డెప్యూటీ ఇఒగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి తోడు మరో డెప్యూటీ ఇఒగా వెంకటసుబ్బయ్యను పెంచలకోన నుంచి బదిలి చేసినట్లు ఉత్తర్వులు జారి అయ్యాయి.

## టపాకాయల గోదాములో విస్తృతంగా తనిఖీలు

### -డిఎస్పీ, తహాశీల్దార్‌లు పలు సూచనలు



.తొట్టంబేడు, జూన్ 1 ప్రభాతవార్త

మండలంలోని శ్రీకాళహస్తి-నాయుడుపేట బైపాస్‌రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మిగణపతి క్రాకర్స్ హోల్‌సేల్ గోడౌన్‌ను గురువారం డిఎస్పీ బీమారావు, టుటౌన్ సిఐ మల్లికార్జున, తొట్టంబేడు తహాశీల్దార్ సుధీర్‌రెడ్డి, అగ్నిమాపకశాఖ సిబ్బంది నాగార్జునరెడ్డిలు పరిశీలించారు. వరదయ్యపాళెం మండలంలో టపాకాయల దుకాణంలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి మరియు తొట్టంబేడు మండలంలో ఉన్న టపాకాయల గోదాములను పరిశీలించారు. తొట్టంబేడు మండల పరిధిలో ఉన్న శ్రీలక్ష్మిగణపతి క్రాకర్స్ హోల్‌సేల్ గోడౌన్‌కు సంబందించి రికార్డులను పరిశీలించి గోడౌన్‌కు సంబందించి లైసెన్సు రెన్యువల్ చేసుకోవాలని అంతవరకు మూసివేయాలని నిర్వాహకులను ఆదేశించారు. దుకాణంలో ఉన్న టపాకాయలను పరిశీలించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తయారీ విధానం ఉండరాదని ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని ప్రమాదాలు జరిగినపుడు గోదాములో ఉండాల్సి న సౌకర్యాలను గుర్తించారు. అనంతరం నిర్వాహకుల వద్ద వ్రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. వీరితోపాటు గోదాము నిర్వాహకులు పాల్గొన్నారు. తనిఖీల్లో తొట్టంబేడు తహాశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ మురళీ, విఆర్ఓ ముయర్ణ, సిబ్బంది సురేష్ తదితరులు ఉన్నారు.

## గణనాధుని సేవలో పలువురు ప్రముఖులు



కాణిపాకం, జూన్ 1 ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరక్టర్ సుదర్శన్‌రెడ్డి, కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘునాథరెడ్డిలు కుటుంబసమేతంగా గురువారం వేర్వేరుగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, చిత్తూరు కోర్టు బార్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నగర సుందరీకరణ పోటీలకు సిద్ధంకండి

### కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, జూన్ 1, ప్రభాతవార్త

స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నగర సుందరీకరణ పోటీలను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో అన్ని నగరాలు పోటీ చేయవల్సిందిగా కోరడంతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పోటీలకు సిద్ధమవుతున్నట్లు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్యాలయంలో ఈ అంశం పై గురువారం సాయంత్రం విభాగ అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన కమిషనర్ హరిత మాట్లాడుతూ జూలై 15 నుండి రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు గడువు నిర్ణయించారని, ఇందులో ముఖ్యంగా సిటీ సుందరీకరణలో భాగంగా వార్డు లెవెల్, సిటీ లెవెల్, స్టేట్ లెవెల్, నేషనల్ లెవెల్లో సుందరీకరణ ఎలా ఉందనే విషయంలో నాలుగు కేటగిరిల్లో పోటీలు ఉంటాయన్నారు. మన తిరుపతి సిటీ లెవెల్లో పోటీల్లో పాల్గొనేందుకు కావాల్సి న అన్ని అర్హతలు ఇప్పటికే ఉన్నాయని, ముఖ్యంగా గ్రీన్ స్పేస్, వాటర్ ఫ్రంట్ ఒక కేటగిరిగా ఉండగా, మరో కేటగిరిలో హెరిటేజ్, టూరిజం ఉండగా, ఇంకో కేటగిరీలో మార్కెట్, కమర్షియల్ ఏరియాలో ఉన్నాయని, ఇందులో అన్ని కేటగిరిలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ దృడంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా వాటర్ ఫ్రంట్ కేటగిరిలో వినాయక సాగర్ ఉండగా, టూరిస్టు, హెరిటేజ్ కేటగిరిలో రామాలయం, గోవిందరాజు స్వామి ఆలయం, నంది సర్కిల్ నుంచి గరుడ సర్కిల్ వరకు, అదే విధంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ లైన్ రోడ్, ఎస్వీ యూనివర్సిటీ లైన్ రోడ్లు, అలాగే అలిపిరి రోడ్లు ఉన్నాయని చెబుతూ నగర సుందరకారణ పోటీల్లో పాల్గొని నగర సుందరీకరణకు మరింతగా అభివృద్ధి చేయాలని అధికారులు ఉద్దేశించి కమిషనర్ హరిత తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్‌హరికృష్ణ, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, డిఈలు విజయకుమార్‌రెడ్డి, రవీంద్ర రెడ్డి, దేవిక, గోమతి, మహేష్, నరేంద్ర పాల్గొన్నారు.

## ఎన్నికల మేనిఫెస్టో ప్రజలందరికీ వరం

### -చంద్రబాబు చిత్రపటానికి నేతల పాలాభిషేకం

తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త:




రాష్ట్రంలో నాలుగేళ్ళ వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని, ఎన్నో ఇబ్బందులు కలిగించి విద్వేషాలతో వణికించారని, ప్రజల కష్టాలు తెలుసుకుని 2024 ఎన్నికలకు మేనిఫెస్టో ప్రకటించిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సుపరిపాలన అందించగలరని టిడిపి నేతలు విశ్వాసం తెలిపారు. అనేక సంక్షేమ పథకాలతో మేనిఫెస్టో విడుదల చేయడంతో వైసిపిలో వణుకు పుట్టిందన్నారు. చంద్రబాబు అనుభవం ఉన్న నాయకుడని, ఆయన చెబితే సంక్షేమం అభివృద్ధి ఏంటో చేసి చూపెట్టే సత్తా ఉందన్నారు. మేనిఫెస్టోతో పేదలు, మధ్యతరగతి వాళ్ళు ఎంతోసంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. టిడిపి మేనిఫెస్టోతో చంద్రబాబు చిత్రపటానికి గురువారం తిరుపతిలో టిడిపి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్, వి.సురేంద్రకుమార్, సూరాసుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్, దంపూరి భాస్కర్, వట్టికుంట చిన్నబాబు, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, బుల్లెట్‌రమణ, కంకణాల రజినీకాంత్‌నాయుడు , ఆనంద్‌గౌడ్, ఆర్‌పి శ్రీనివాసులు, వెంకీరాయల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికులు లేని జిల్లాగా తిరుపతి

### -బాల కార్మిక వ్యవస్త నిర్మూలనకు ప్రత్యేక బృందం

### -ఉప కార్మిక కమీషనర్ బాలు నాయక్

తిరుపతిరూరల్, జూన్01 ప్రభాతవార్త:



బాల కార్మికుల లేని జిల్లాగా తిరుపతిని చేయుటకు బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఉప కార్మిక కమీషనర్ బాలు నాయక్ తెలిపారు. దిశ డియస్పీ కాటమరాజు ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, ఎన్జీవోస్, సహాయ కార్మిక కమిషనర్లు, సహాయ కార్మిక అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందం దుకాణములు, సంస్థలు, ఇటుకబట్టీలు, హోటల్ తదితర చోట్ల పనిచేసే బాల కార్మికులకు గుర్తించి, బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు

## శ్రీవారి అనుగ్రహంతో మంచిపాలన అందించే శక్తిసామర్థ్యాలు కలగాలి : గౌడపేరు చిట్టిబాబు

తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త:



కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు, అనుగ్రహంతో కర్నాటకలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు ప్రజలకు మంచి పాలన అందించే శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని కాంగ్రెస్ పిసిసి ఎస్‌సి విభాగం కో ఛైర్మన్ గౌడపేరు చిట్టిబాబు కోరారు. నూతన ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కెహెచ్ మునియప్ప, పరమేశ్వర్‌ను గురువారం ఉదయం బెంగుళూరులోని విధానసౌధలోని వారి ఛాంబర్లలో మర్యాదపూర్వకంగా పిసిసి ఎస్సీ విభాగం ఛైర్మన్ షాకే శంకర్, కో ఛైర్మన్ గౌడ పేరుచిట్టిబాబు కలిశారు. వీరికి వెంకన్న ఆశీస్సులతోబాటు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. నూతన మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘంటసాల అభిమాని కృష్ణమూర్తికి సన్మానం



తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త:

ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి గురువారం ఉదయం రాయలసీమరంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల అభిమాని కృష్ణమూర్తిని రాయలసీమ రంగస్థలి కళాకారులు ఘనంగా సన్మానించారు.

## జాగ్రత్తలు తీసుకుంటూ కళ్ళను కాపాడుకోవాలి

### -డాక్టర్ సుధారాణి

తిరుపతినగరం, జూన్ 1ప్రభాతవార్త:



శరీరంలో అతిసున్నితమైన కళ్ళను ప్రతిరోజూ చల్లనినీటితో శుభ్రం చేసుకోవాలని, వయసు పెరిగే కొద్దీ కళ్ళను జాగ్రత్తగా కాపాడుకోవాలని సాయిసుధ కంటి ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి తెలిపారు. డయాబెటీస్ ఉన్న వాళ్ళు ప్రతి 3నెలలకోసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని వ్యాధిని అదుపులోకి ఉంచుకుంటే రెటీనోపతి బారిన పడకుండా ,కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని డాక్టర్ తెలిపారు. గురువారం ఉదయం తిలక్‌రోడ్డులోని సాయిసుధ కంటి ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 50మందికిపైగా రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది హిమబిందు, పురుషోత్తం, ధరణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణామూర్తి, మహా విష్ణు, బ్రహ్మ, చండికేశ్వర, నాగదేవత విగ్రహాల ప్రతిష్ట

తిరుపతిరూరల్, జూన్ 1 ప్రభాతవార్త:



ముత్యాలరెడ్డిపల్లిలో వెలసిన శ్రీగౌరీ శంకర్ ఆలయంలో గురువారం దక్షిణామూర్తి, మహావిష్ణువు, బ్రహ్మ, చండికేశ్వర, నాగదేవత విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీ గౌరీశంకర్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. విగ్రహాల ప్రతిష్ట కార్యాలయంలో పాల్గొన్న ఎమ్మెల్సీకి ఆలయ నిర్వాహణ కమిటీ స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ సిపాయికి ఆలయ పూజారులు ఆశ్వీరదించారు. ఆలయ ధర్మకర్త శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నాగాలమ్మ కుంభాభిషేకం

విజయపురం, జూన్ 1 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన విజయపురంలో నాగాలమ్మ కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా జరిగింది. కుంభాభిషేకంలో నాడీ సంధానం, కళా న్యాసహోమం, మహా అభిషేకం, అలంకరణ, తీర్థ ప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ కుంభాభిషేకంలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు, ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, ఆలయపురోహితులు వందవాసి మహేష్ పలువురు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో భారీ వర్షం .. సుడిగాలి బీభత్సం

### కూలిన వృక్షాలు తృటిలో తప్పిన పెను ప్రమాదం

చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:




చంద్రగిరిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి సుడిగాలి తోడు కావడంతో రెండు మహావృక్షాలు సైతం చిగురుటాకులా వణికిపోతూ నేలకూలాయి. అప్పటి వరకు మండుటెండతో ఉక్కపోతకు గురై జనం విలవిలాడారు. ఒక్కసారిగా భారీ శబ్దాలతో మొదలైన ఉరుములు, సుడిగాలితో కలసి అతలాకుతలం చేసిన భారీ వర్షం దాదాపు గంట సమయం ప్రజలు ఎటువైపు నుండి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గుండెలరచేత పట్టుకునేంత పనిచేసింది. స్థానిక చేగు సూపర్ మార్కెట్‌కు ఎదురుగా గల భారీ వేప వృక్షం ఒక్కసారిగా పెళపెళ శబ్దాలతో అటుగా వెళుతున్న ఆటోపై కూలింది. అయితే ఆటో స్వల్పంగా ధ్వంసం కావడంతో అందులోని డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు. అదేవిధంగా లైబ్రరీ సమీపంలో మరో వేపవృక్షం టాటాఏస్ లగేజీ ఆటోపై పడిన ఘటనలో ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పూల్చుకున్నారు. సమాచారం అందుకున్న సిఐ ఓబులేష్, ఎస్ఐలు వంశీధర్, హిమభింధు, తమ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను దారిమళ్ళించారు. చెట్ల కొమ్మలను కట్‌చేసి తొలగించే పనులను యుద్ధప్రాతిపధికన చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు భారీ ఎత్తున విలయతాండవం చేస్తున్న ఈదురు గాలులకు విద్యుత్ ప్రమాదాలను నివారించడానికై ముందస్తుగానే విద్యుత్ సరఫరా నిలివేశారు. దీంతో విద్యుత్ తీగలపై చెట్లు కూలిన ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

## గాలివాన భీభత్సం.. నేలకూలిన విద్యుత్ స్థంభాలు.. చెట్లు

కుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో గురువారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురుగాలులు వీచడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్థంభాలు, చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శెట్టిపల్లి సబ్‌స్టేషన్, కుప్పం ఏరియా ఆస్పత్రి సర్కిళ్లలో నాలుగు విద్యుత్ స్థంభాలు నేలకూలాయి. రెస్కో అధికారులు వర్షం ఆగిన అనంతరం తెగిన విద్యుత్ లైన్లను సరిచేసి రాత్రికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పలుచోట్ల మామిడి, టమోటా పంటలు నేలరాలాయి.